క్లుప్తంగా

విద్యాప్రమాణాలను పాటించండి



ములగపూడి పాఠశాలలో ఉపాధ్యాయులతో చర్చిస్తున్న ఎంఈఓ

రౌతులపూడి: ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించి ఉపాధ్యాయులందరూ విద్యాప్రమాణాలను పెంచాలని ఎంఈఓ ఎస్వీ నాయుడు అన్నారు. బుధవారం మండలంలోని ఎస్.పైడిపాల, ములగపూడిలో పాఠశాలలను సందర్శించి, వాటి నిర్వహణ, రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరుశాతం, మధ్యాహ్న భోజనాల నాణ్యత, సిలబస్, టీచర్స్ డైరీ పాఠ్యాంశాల ప్రణాళిక తదితర అంశాలపై ఆరాతీశారు.

చురుగ్గా డ్రైన్ల నిర్మాణ పనులు



పనులు పరిశీలిస్తున్న నాయకులు

ఏలేశ్వరం: పట్టణంలోని ప్రధాన రహదారులను ఆనుకుని చేపట్టిన డ్రైన్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 కోట్లతో ప్రధాన రహదారులను ఆనుకుని డ్రైన్లు నిర్మిస్తున్నారు. దీనిలో భాగంగా ఆక్రమణలను తొలగిస్తున్నారు. కొన్నిచోట్ల స్వచ్ఛందంగా ఆక్రమణదారులు తొలగిస్తున్నారు. డ్రైన్ల నిర్మాణ పనులను బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ సూచనల మేరకు డ్రైన్ల నిర్మాణం వేగవంతం చేశామన్నారు. డ్రైన్ల నిర్మాణంతో మురుగు సమస్య తీరుతుందన్నారు.

గోకవరంలో అన్నదానం

గోకవరం: స్థానిక రమాసత్యనారాయణ స్వామి ఆలయం వద్ద బుధవారం భారీ అన్నదానం జరిగింది. ఆలయంలోని ఉమా సమేత గోకర్ణేశ్వరస్వామి శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ అన్నదానం నిర్వహించారు. సుమారు ఐదు వేల మంది భక్తులు అన్నదానం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



వేలంకలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ చిరంజీవిరావు

కిర్లంపూడి: వేలంకలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను బుధవారం ఏపీఓ బి.చిరంజీవిరావు పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించడమే లక్ష్యం పనిచేయాన్నారు. ప్రతి ఒక్కరూ తమ జాబ్ కార్డుకు ఆధార్‌తో అనుసంధానం చేయించుకోవాలన్నారు. ఉపాధి పనులను పారదర్శకంగా నిర్వహించాలని ఫీల్డ్‌అసిస్టెంట్ బిందన రాజేష్‌ను ఆయన ఆదేశించారు.

108లో ఆడబిడ్డ జననం



బిడ్డను చూపిస్తున్న 108 సిబ్బంది

ప్రత్తిపాడు: గ్రామ 108 వాహనంలో బుధవారం సాయంత్రం ఓ గర్భిణీ ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ప్రత్తిపాడు మండలం చింతలూరు గ్రామానికి చెందిన కె.కృష్ణవేణికి ఏడో నెలలోనే పురిటి నొప్పులు ఎక్కువగా రావడంతో బంధువులు 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది సకాలంలో చింతలూరు చేరుకొని గర్భిణీని తీసుకొని గొల్లప్రోలు మండలం కొడవలి మీదుగా కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలిస్తున్నారు. అయితే జాతీయ రహదారిపై వన్నెపూడి జంక్షన్ చేరే సరికి కృష్ణవేణికి ఆడబిడ్డకు జన్మనించింది. ఆమె బంధువుల సహాయంతో పైలట్ శ్రీనివాస్, ఈఎంటీ సంధ్య పురుడు పోశారు. తల్లీ బిడ్డను కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. వారు క్షేమంగా ఉన్నట్టు సిబ్బంది తెలిపారు.

శిలువ ధ్యాన కూడికలు ప్రారంభం

సామర్లకోట: క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే 40 దినాల శిలువ ధ్యాన కూడికలు చర్చిల్లో బుధవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఏసు క్రీస్తు శిలువపై మరణించిన రోజుకు ముందుగా ఉన్న 40 రోజుల పాటు ఉపవాస దీక్షలతో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించడం పరిపాటిగా జరుగుతుంది. ఆంధ్రా బాప్టిస్టు చర్చి, సెంటినరీ బాప్టిస్టు చర్చి, అగస్థాన లూథరన్ చర్చి, షాలెం బాప్టిస్టు చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశార

ఊపందుకున్న ఉపాధి

- వేసవి ఆరంభంతోనే పనులు ప్రారంభం
- క్లస్టర్లో 7257కి పెరిగిన హాజరు
- వంద రోజుల పని పూర్తి చేసిన 118 కుటుంబాలు



రేఖవానిపాలెం వద్ద తాండవ వరద నివారణకు గట్టు వేస్తున్న కూలీలు

తుని రూరల్: వేసవి ఆరంభంతోనే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ఊపందుకున్నాయి. కొద్దిరోజులుగా రోజురోజుకూ పనుల్లో పాల్గొనే కూలీల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అయితే లక్ష్యానికి అనుగుణంగా కూలీలు హాజరు లేకపోవడంతో ఉన్నతాధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుని మండలంలో 50 శాతానికి పైగా హాజరు ఉండగా మిగిలిన నాలుగు మండలాల్లో 50 శాతం లోపే హాజరవుతున్నారు. దీంతో రోజువారీ లక్ష్యాలు సాధించేందుకు డ్వామా పీడీ, ఏపీడీ, ఎంపీడీఓలు, ఏపీఓలు టెక్నికల్ అసిస్టెంట్లను, ఫీల్డ్ అసిస్టెంట్లను, మేట్లను పరుగులు పెట్టిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం వేసవి అలవెన్సులను రద్దు చేసిన ప్రభావం కూలీల హాజరుపై తీవ్రంగా చూపిస్తోందని కూలీలు, అధికారులు పేర్కొన్నారు. వేసవిలో సులభంగా పనులు చేసేందుకు చెరువులు, పంట కాలువల్లో పూడికలు తొలగింపు, పంతరోడ్డు నిర్మాణం, వర్షపు నీటి సంరక్షణకు ట్రెంచ్‌లు తవ్వకం, జగనన్న ఇళ్ల నిర్మాణంలో 90 రోజుల పనులు జరుగుతున్నాయి.

కూలీల హాజరు ఇలా

కత్తిపూడి క్లస్టర్ పరిధి ఐదు మండలాల్లో రోజువారీ కూలీల సంఖ్య 19,800 మంది హాజరు కావాల్సి ఉంది. తుని మండలంలో 2217 మంది, కోటనందూరులో 1639 మంది, తొండంగిలో 1316 మంది, రౌతులపూడిలో 1078 మంది, శంఖవరం మండలంలో 1007 మంది ఉపాధి పనులు చేస్తున్నారు. ఐదు మండలాల్లో బుధవారం నాటికి 118 కుటుంబాలు వంద రోజులు పనులు పూర్తి చేశారు. ఏప్రిల్ నుంచి కూలీల హాజరు సంఖ్య పెరగనుంది.

లక్ష్యాన్ని అధిగమిస్తాం

రోజువారీ కూలీల లక్ష్యం నాలుగు వేల మంది. లక్ష్యానికి అనువుగా కూలీలను పనుల్లోకి రప్పించేందుకు కృషి చేస్తున్నాం. ఇందుకు టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లతో నిత్యం సమీక్షిస్తున్నాం. కూలీలకు ఈనెల 12 వరకు చేసిన పనులకు కూలి డబ్బులు ఆయా ఖాతాల్లో జమయ్యాయి. ఆధార్ నంబర్లు అనుసంధానం కానివారికి జమకావాల్సి ఉంది. ఆధార్ లింకేజీకి ఏర్పాట్లు చేశాం.

– పి.నారాయణరావు, ఏపీఓ, తుని



కానిస్టేబుల్ నిజాయితీ



బ్యాగును అందజేస్తున్న తుని జీఆర్పీ పోలీసులు

తుని: స్థానిక రైల్వేస్టేషన్‌లో ఎవరో వదిలివేసిన బ్యాగును భద్రంగా జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించాడు కానిస్టేబుల్ ప్రసాద్. బుధవారం జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి కాస్టేబుళ్లు రామకోటి, ప్రసాద్ డ్యూటీలో ఉన్నారు. వీరికి ఒకటో నంబరు ఫ్లాట్‌ఫాంలో బ్యాగు దొరికింది. అందులో లభించిన చిరునామా ప్రకారం కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం నాయకర్ కాలనీకి చెందిన తోలాడ శైల పార్వతిగా గుర్తించారు. వారికి ఫోన్ చేసి చెప్పారు. తుని జీఆర్పీ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన శైలపార్వతి భర్త బుజ్జికి బ్యాగ్‌ను అప్పగించారు. బ్యాగులో రూ.20వేలు విలువ చేసే సెల్‌ఫోన్, రూ.5000 నగదు, బంగారం తాకట్టు పెట్టిన రూ.లక్షకు చెందిన రశీదులను భద్రంగా అప్పగించారు. విధి నిర్వహణలో నిజాయితీగా వ్యవహరించిన కానిస్టేబుల్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.

మతిస్థిమితం లేని యువకుడి అప్పగింత



తప్పిన స్మితా ప్రకాష్ బిశ్వాస్‌ను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

తుని: అనకాపల్లి జిల్లా యలమంచిలి రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకుడిని జీఆర్పీ పోలీసులు శివ సురేష్, రోనకేశ్వరరావు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఆకలితో ఉన్న స్మితా ప్రకాస్ బిశ్వాస్‌కు భోజనం పెట్టించి తుని జీఆర్పీ పోలీస్టేషన్‌కు తీసుకువచ్చారు. ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ దృష్టికి తీసుకువెళ్లారు. స్మితా ప్రకాష్ బిశ్వాస్ తెలిపిన వివరాలు మేరకు ఒడిశాలోని కటక్ పోలీస్‌స్టేషన్ సమాచారం అందజేశారు. స్మితా ప్రకాష్ బిశ్వాస్‌పై అతని తల్లిదండ్రులు రంజన్ బిశ్వాస్, సురేఖ బిశ్వాస్‌లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దీంతో కటక్ నుంచి వచ్చిన తల్లిదండ్రులకు బుధవారం స్మితా ప్రకాష్ బిశ్వాస్‌ను అప్పగించామని చెప్పారు.

రత్నగిరిపై పెళ్లి సందడి

- ఫాల్గుణ మాసంలోనూ జోరుగా పెళ్లిళ్లు
- మార్చి 13 వరకు ముహూర్తాలు



సత్యగిరిపై ఎంఎస్ రెడ్డి అంజనీ వివాహ వేదిక

అన్నవరం: మాఘమాసం ముగిసింది. ఆ నెలంతా పెళ్లిళ్లతో రత్నగిరిపై సందడి నెలకొన్న విషయం తెలిసిందే. మంగళవారం నుంచి ఫాల్గుణమాసం ప్రారంభమైంది. ఈ నెలలో కూడా వివాహాలు జరుగనుండడంతో దేవస్థానంలో సందడి మొదలైంది. కోస్తా జిల్లాల్లో వివాహాలకు ఎక్కువగా జరిగేది రత్నగిరి సత్యదేవుని ఆలయం. ఈ ఏడాది మాఘమాసంలో సుమారు రెండు వేల వివాహాలు జరిగాయి. రాష్ట్రంలో పలు ప్రాంతాలలో వివాహాలు చేసుకున్న వారు కూడా వేల సంఖ్యలో సత్యదేవుని సన్నిధికి వచ్చి వ్రతాలు ఆచరించి స్వామివారిని దర్శించడం ఆనవాయితీ.

మార్చి 13 వరకు వివాహ ముహూర్తాలు

ఫాల్గుణ మాసంలో బహుళ సప్తమి, అంటే మార్చి 13 వరకు వివాహాలు జరుగనున్నాయి. ఫిబ్రవరి 22, 23, 24, మార్చి 1, 2, 3, 4, 8, 9, 11, 13 తేదీలలో వివాహ ముహూర్తాలున్నాయి. ఆ తేదీలలో రత్నగిరిపై ఎక్కువగా వివాహాలు జరుగునున్నాయి. ఆ తేదీలలో రత్నగిరి సత్రాలలో గదులు వివాహ బృందాలు రిజర్వ్ చేసుకున్నందున సాధారణ భక్తులకు తక్కువగా మాత్రమే గదులు లభ్యమవుతాయని అధికారులు తెలిపారు. ఈ వివాహాల కారణంగా రత్నగిరిపై వివాహ మంటపాలు, క్యాటరింగ్, పురోహితులు, భాజాబజంత్రీలకు డిమాండ్ ఏర్పడింది.

ఉచిత మంటపాలలోను కల్యాణ వేదికలు రిజర్వ్

విశాఖపట్నానికి చెందినపారిశ్రామిక వేత్త ఎంఎస్ రెడ్డి నిర్మించిన 'ఎంఎస్ రెడ్డి అంజని ఉచిత వివాహ వేదిక ' లో ఈ ముహూర్తాలలో వివాహాలు చేసుకునేందుకు వేదికలు రిజర్వ్ అయ్యాయి. ఇక్కడ ఏక కాలంలో 12 వివాహాలు జరిగేలా మంటపాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ వివాహాలు చేసుకున్నవారికి పెళ్లిపీటలు, కుర్చీలు, కాడి, రోకళ్లు, ఇతర సామగ్రి ఉచితంగా సమకూర్చుతున్నారు. మట్టే శ్రీనివాస్ దంపతులు నిర్మించిన శ్రీసత్య శ్రీనివాస ఉచిత ఏసీ కల్యాణ మంటపంలో కూడా ఒకే ముహూర్తంలో ఏకకాలంలో 12 వివాహాలు చేసుకునే వీలుంది. పెళ్లిబృందాలు కూడా ఆ ముహూర్తాలలో వివాహాలకు ఏర్పాట్లు చేసుకున్నారని నిర్వాహకులు తెలిపారు.

సమస్యలు, అభివృద్ధిపై ఎప్పటికప్పుడు సమీక్షించాలి

- సమావేశాలకు హాజరుకావాలి
- ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే చంటిబాబు సూచన
- జగ్గంపేట మండల సర్వసభ్య సమావేశం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: గ్రామాల్లో సమస్యలు, జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని, మండల సమావేశాలు ఆయా సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. బుధవారం ఎంపీపీ అత్తులూరి నాగబాబు అధ్యక్షతన జరిగిన జగ్గంపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. మండలంలో వివిధ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మండల సమీక్షా సమావేశాలు నిర్వహించి అక్కడే పరిష్కరించాలన్నారు. లేకుంటే సమన్వయం లోపిస్తుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు అధికారులు కలిసి పని చేసి గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. సమావేశానికి పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకాకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ రాజ్ ద్వారా జరుగుతున్న భవన నిర్మాణ పనుల తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులు, వాటి పరిష్కారంపై వ్యవసాయ అధికారులతో చర్చించారు. వీటితో పాటు వెలుగు, ద్వారా చేపడుతున్న వివిధ పథకాల అమలను ప్రశ్నించారు. ఆర్అండ్‌బీ శాఖ జగ్గంపేట, గోకవరం రోడ్డులో ఉన్న సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బిందుమాధవి, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, మండల పరిషత్ అధికారి హరికృష్ణ, తహసీల్దార్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా బుల్లెమ్మ బాధ్యతల స్వీకరణ



పెద్దాపురం: పెద్దాపురం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా జి.బుల్లెమ్మ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఏలూరు కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వర్తిస్తూ న్యాయమూర్తిగా పదోన్నతిపై పెద్దాపురం కోర్టుకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకూ ఆ స్థానంలో విధులు నిర్వర్తిస్తున్న హర్షవర్ధన్ పెద్దాపురం కోర్టులోనే పదోన్నతిపై ప్రిన్సిపాల్ జూనియర్ జడ్జిగా నియమితులయ్యారు. అడిషనల్ జూనియర్ మెజిస్ట్రేట్‌గా విధులు చేపట్టిన బుల్లెమ్మను పలువురు న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

అటకెక్కిన వ్రతాల అవకతవకల విచారణ?

- నివేదిక ఇచ్చి మూడు రోజులైనా చర్యలు శూన్యం
- క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం: ఈఓ సత్యనారాయణ మూర్తి

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వ్రతాల విభాగంలో పూజాద్రవ్యాల వినియోగంలో అవకతవకలపై విచారణ నివేదిక వచ్చి మూడు రోజులవుతున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. వ్రతాల నిర్వహణలో భాగంగా భక్తులకు దేవస్థానం కొన్ని పూజాద్రవ్యాలను అందజేస్తుంది. వ్రతాల గావంచా మీద వేసే బియ్యం, దీపం వెలిగించే నూనె, అగరవత్తులు, హారతి కర్పూరం, కలశం మీద పెట్టే జాకెట్టు మొదలగునవి నిర్దిష్ట పరిమాణంలో అందజేయాలి. అలా అందచేయకుండా సగం సగం మాత్రమే సరఫరా చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సూపరింటెండెంట్ ఐవీ రామారావును ఈఓ సత్యనారాయణమూర్తి ఆదేశించారు. సన్నిధి విభాగం సూపరింటెండెంట్ రామారావు ఆదివారం విచారణ నిర్వహించి తన నివేదికను సోమవారం ఈఓకు అందజేశారు. ఆయన విచారణ జరిపి ఎనిమిది మంది ఉద్యోగుల వాదనలను రికార్డు చేసి నివేదిక సమర్పించారు. దీనిపై వెంటనే చర్యలు ఉంటాయని అందరూ భావించారు. అయితే చర్యలు తీసుకోవడానికి కాలయాపన జరుగుతుండడంతో విచారణ నివేదికను కావాలనే తొక్కిపెడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఈఓ సత్యనారాయణ మూర్తిని సాక్షి వివరణ కోరగా విచారణ నివేదికను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. పరిశీలన పూర్తయ్యాక చర్యలు ఉంటాయని తెలిపారు.

'రైతు పొలం సందర్శన' తో సాగులో మెళకువలు



చేబ్రోలు ఆర్బీకేను సందర్శించిన డాక్టర్ నాయక్, డాక్టర్ వెంకటనరసింహారావు, విద్యార్థులు

పిఠాపురం: గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా బుధవారం గొల్లప్రోలు మండలం దుర్గాడ చేబ్రోలులో రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతు పొలం సందర్శన నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్యామ్ రాజ్ నాయక్, జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు గ్రామాల్లో నివాసం ఉండి రైతుల అనుభవాలను నేర్చుకుంటున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులను కలుసుకున్నారు. పొలాలను సందర్శించి రైతు స్థితిగతులను, ఆర్బీకేల పనితీరును, విద్యార్థుల పని అనుభవాలను పరిశీలించారు. నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు రైతులతో సన్నిహితంగా ఉంటూ సాగులో అనుభవాన్ని గడిస్తున్నారన్నారు. ఆర్బీకేల పనితీరు బాగుందని డాక్టర్ చల్లా తెలియజేసారు. అనంతరం రైతులకు ఎలుకల నివారణ మందులను పంపిణీ చేశారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి గాయాలు

పెద్దాపురం: వేగంగా వెళుతున్న బైక్ అదుపు తప్పి యువకుడు తీవ్ర గాయాల పాలైన ఘటన బుధవారం సాయంత్రం పెద్దాపురం మండలం సిరివాడలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గుడివాడ గ్రామానికి చెందిన పెదిరెడ్ల నాగేంద్ర(29) తన బంధువుల ఇంటికి బైక్‌పై వెళుతుండగా అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో నాగేంద్రకు తీవ్ర గాయాలవ్వడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పెద్దాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

కొత్తపల్లి: ఒక వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. మండలంలోని పాత ఇసుకపల్లికి చెందిన ఎస్.ఉమామహేశ్వరి భద్రాచలానికి చెందిన దేవీవరప్రసాద్‌తో గతంలో వివాహమైంది. ఈ నెల 13న తన పుట్టింటికి వచ్చింది. ఈ నెల 20న బయటకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాకపోవడంతో భర్త దేవీవర ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మార్కెట్ ఆశీల వేలం వాయిదా

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలోని రోడ్డు మార్జిన్‌లో వ్యాపారాలు చేసుకునే వారి నుంచి మార్కెట్‌లో ఆశీలు వసూలు చేసుకోవడానికి బుధవారం చేపట్టిన మార్కెట్ ఆశీల వేలం వాయిదా పడింది. మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ అధ్యక్షతన మార్కెట్ ఆశీలు, మేకల కబేళా, పశువుల కబేళా వేలం పాటలను నిర్వహించారు. మార్కెట్ ఆశీల పాటకు పాటదారులు ముందుకు రాకపోవడంతో వాయిదా వేసినట్లు కమిషనర్ ప్రకటించారు. మేకల కబేళా రూ.80 వేలకు రోటా శ్రీనివాస్, పశువుల కబేళా రూ.1.60 లక్షలకు అబ్దుల్ అజీజ్‌లను హెచ్చు పాటదారులుగా గుర్తించామని కమిషనర్ తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలి

సామర్లకోట: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాల్లో ఇళ్లను వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ డి.శ్రీలలిత అన్నారు. బుధవారం సాయంత్రం మండల పరిధిలోని పవర గ్రామంలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను ఆమె పరిశీలించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలతో పాటు మహిళా సంఘాలకు బ్యాంకులు ఇస్తున్న రూ.35 వేలతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈఓ పీఆర్డీ హిమమహేశ్వరీ అన్నారు.

ఏఐఎఫ్‌టీయూలో పారిశుధ్య కార్మికుల చేరిక



కమిషనర్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

పిఠాపురం: అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టీయూ)లో గొల్లప్రోలు నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు చేరినట్లు సమాఖ్య మాజీ నాయకులు కుంచే అంజిబాబు, డి.నారాయణమూర్తి బుధవారం తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల ప్రధాన కార్యదర్శి రంబాల సతీష్ సమక్షంలో వారు చేరడం ఆనందదాయకం అన్నారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు నగర పంచాయతీ కమిషనర్ ఎం.సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు.

బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన ఎస్ఐ



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు

సామర్లకోట: ట్రాఫిక్ ఎస్ఐ ఒంటరిగా వెళుతున్న బాలికను గుర్తించి ఆమె తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక గౌతమి మోడల్ స్కూలులో ఐదో తరగతి చదువుతున్న పీకే మాధురిని ఆమె తండ్రి లోవబాబు రోజూ మోటారు సైకిలుపై పాఠశాలకు తీసుకువెళతాడు. అయితే మాధురి బుధవారం ఉదయం నడిచి స్కూలుకు వెళతానని చెప్పడంతో దగ్గరే కదా అని ఒప్పుకున్నారు. అయితే లారీ స్టాండ్ నుంచి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జికి ఒంటరిగా నడిచి వెళ్లిన మాధురి అటు నుంచి ఎటు వెళ్లాలో అర్థం కాక ఆగిపోయింది. తరగతులు ప్రారంభమైనా పాఠశాలకు మాధురి రాలేదని స్కూల్ నుంచి టీచర్లు చెప్పడంతో బాలిక తల్లిదండ్రుల్లో కలవరం మొదలైంది. ఇంతలో ఫ్లైఓవర్ బ్రిడ్జిపై విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు బాలికను ప్రశ్నించి ఆమె పుస్తకాల బ్యాగ్‌లోని డైరీలో ఉన్న ఫోన్ నెంబర్ ఆధారంగా తల్లిదండ్రులకు సమాచారమివ్వడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేసి బాలికను అప్పగించారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తి సెంటర్లో 16వ నంబరు జాతీయ రహదారిపై వాహనం ఢీకొని ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో సుమారు 30 ఏళ్ల వ్యక్తి చనిపోయి రక్తపు మడుగులో పడి ఉన్నట్లు స్థానిక వీఆర్‌ఓ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌ప్రకాశ్ తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

- ఉద్యాన శాఖాధికారి సుజాత



రైతు సదస్సులో మాట్లాడుతున్న ఉద్యానశాఖాధికారి సుజాత

పెద్దాపురం: రైతులు ఆయిల్ పాం సాగులో సమగ్ర యాజమాన్య సస్యరక్షణ పోషక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించొచ్చని పెద్దాపురం మండల ఉద్యాన శాఖాధికారి ఎస్.సుజాత అన్నారు. మండలంలోని కొండపల్లి గ్రామంలో కొండబాబు పామాయిల్ తోటలో బుధవారం ఉద్యాన శాఖ, పతంజలి ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు పామాయిల్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖాధికారి ఎస్.సుజాత మాట్లాడుతూ బిందు సేద్యం, తెల్లదోమ నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పతంజలి డీజీఎం రవీంద్ర, పి.దుర్గారావు, కె.వెంకటేశ్వరరావు, డీఎల్ వెంకటేశ్వరరావు, ఎం.వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన సత్య, శిరీష

కొత్తపల్లి: జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో పిఠాపురంలో నిర్వహించిన తైక్వాండో జిల్లా స్థాయి పోటీల్లో వీవీఎస్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు విద్యాసంస్థల కరస్పాండెంట్ అనిశెట్టి కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ఆరో తరగతి చదువుతున్న కె.సత్య స్వర్ణ పతకం, 4వ తరగతి చదువుతన్న కె.శిరీష రజత పతకం సాధించినట్టు తెలిపారు.

నూకాలమ్మ అమ్మవారి తొలి గరగ ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మండలం కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి తొలి గరగ ఉత్సవం బుధవారం రాత్రి అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన గరగ ఉత్సవంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు పల్లా గంగారావు, దేవస్థానం చైర్మన్ గవరసాని వీరాస్వామి, సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయం నుంచి తొలి గరగ ఉత్సవాన్ని జెడ్పీటీసీ సూరిబాబు ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయం నుంచి గరగను బ్యాండ్ మేళాలు, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జోకా నానాజీ, ఎంపీటీసీ జాగు వీరభద్రరావు, ఆలయ ధర్మకర్తలు లక్కాకుల కృష్ణ, నాయకులు గంటా రామస్వామి తదితరులు పాల్గొన్నారు.